కథ



# ఔరా!

**- కె. తాయారమ్మ**

**నేను స్కూల్లో అడుగుపెట్టేసరికి చండికా టీచర్ ఎవరితోనో ఘర్షణ పడుతోంది! ''ఏమైవుంటుంది?'', అనుకుంటూ అటువైపు నడిచాను. ఏ స్టూడెంట్ తాలూకు పేరెంట్సో చండికను నిలదీస్తున్నారు. చండిక మొండిగా వాళ్ళతో వాదిస్తోంది. రోజూ ఇది మామూలే. ఎవరితోనో ఒకరితో తగువులు పెట్టుకుంటుంది చండిక.**

విషయం అవగతమయ్యేసరికి నాకు పావుగంట పట్టింది. ఒక అమ్మాయిని మోకాళ్ళమీద ఎండలో నిలబెట్టింది రెండు పిరియడ్లు. దానితో ఈ పిల్ల మొహం తిరిగి పడిపోయింది. ఇది ఎటెండరు వెంకట సామి చెప్పాడు.

నేను రిజిష్టర్‌లో సంతకం పెట్టి స్టాఫ్ రూంలోకి నడిచాను. ఫస్టు పిరియడే లీజరు నాకు.

స్టాఫ్‌రూంలో ఇది చర్చనీయాంశమైంది. ''నిజంగా చండికా టీచర్ సార్థక నామధేయురాలు సుమండీ!'' అంట ూ నవ్వారు తెలుగు పండితులు కృష్ణమూర్తిగారు.

అందరం నవ్వాము.

చండికది వింత మనస్తత్వం. అందరూ ఆమెను గురించి రకరకాలుగా చెప్తారు. ఆమె ఎవర్నో ప్రేమించి మోసపోయిందని, తరువాత ప్రేమ, పెళ్ళిమీద విరక్తితో అవివాహితగా ఉండిపోయిందని, అందుచేత ఆవిడ మానసిక పరిస్థితి ఇలా మారింది అని అంటారు.

ఏది ఏమైనా ఒక టీచర్ని, అందునా కొలీగ్‌ని విమర్శించడం మంచిదికాదన్న ఉద్దేశంతో ఎవరం మాట్లాడం.

చండిక ప్రవర్తన విచిత్రంగా ఉంటుంది. స్టాఫ్‌తో అస్తమానం తగువులు పెట్టుకుంటుంది. నాతోనే కాస్త బాగా వుంటుంది.

నేను ఇంగ్లీషు, సోషల్ స్టడీస్ చెప్తాను. చండిక లెక్కలు, సైన్సు చెప్తుంది. మేమందరం ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు బోధిస్తాము.

సెకండరీల స్టాఫ్ రూం వేరు.

నాది సర్దుకుపోయే మనస్తత్వం. చండిక ఒకటి రెండుసార్లు మాటలు విసిరినా మౌనంగా వుండిపోయాను.

నేను పాటలు పాడతాను. అందుకే నేనంటే ఇష్టం చండికకి. ''మీరు చాలా బాగా పాడు తారు'' అంటూ ఎన్నోసార్లు మెచ్చుకుంది.

ఆ రోజు నేను స్టాఫ్‌రూంలో కూచుని పేపర్లు దిద్దుకుంటున్నాను చండిక కూడా ఎటెండెన్స్ రిజిష్టర్ పట్టుకు కూచుంది.

ఇంతలో ఓ అమ్మాయి వచ్చి చండిక దగ్గరగా నిలుచుని ''టీచర్!'' అంటూ మృదువుగా పిలిచింది.

''ఏం? ఎందుకు?'' గయ్‌మంది చండిక.

''టీచర్ నన్ను 'ఎ' సెక్షన్లోకి మార్చండి. తెలివైన పిల్లలందరూ అందులోనే వున్నారు. వాళ్లతో పోటీ పడి చదివితే నాకూ ర్యాంక్ వస్తుంది'' అందా అమ్మాయి.

''ఏమే అంతా నీ ఇష్టమేనా? 'ఏ' సెక్షన్లో పప్పులున్నాయా? పరమాన్నాలున్నాయా? వచ్చే మార్కులు ఎందులోవున్నా వస్తాయి'' అంటూ కసురుకుంది.

'ఎ' సెక్షన్ క్లాస్ టీచర్ చండిక. ఆ పిల్ల 'సి' సెక్షన్లోవుంది.

గుడ్లనీరు కక్కుకుంటూ నిలుచుందా పిల్ల. ఆ పిల్ల పేరు సుషుమ. మంచి తెలివైన పిల్ల. పేద పిల్ల. కొందరు టీచర్లం, మరి కొందరు దాతలు కలిసి ఆమె చదువుకి సహాయం అందిస్తున్నాం. ఓ సారి నేను సుషుమకి జోళ్లు కొనిచ్చాను. నిజానికి నేను సుషుమని సెక్షన్ మార్చడం అంతపెద్ద పనే మీకాదు. కాని... కాని.. చండికతో పడలేక అందరం మౌనం వహించాం.

చాలా సేపు నిలబడి ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది సుషుమ. ''చూడండి లలితగారు ఈ వేషాలు. పిల్లలు మనం చెప్పినట్లు వినడం కాదు. మనం వాళ్ళు చెప్పినట్లు వినాలిట!'' ''ఈ పిల్లకెంత పొగరనుకున్నారు'' అంది చండిక.

నేను ఆశ్చర్యపోయాను. టీచర్లందరికీ తలలో నాలుకలా వుంటుంది సుషుమ. అలాంటి పిల్లనా ఈమె నిందించడం?

నాలుగు రోజులు దొర్లాయి.

మళ్లీ నేను స్టాఫ్ రూంలో కూర్చున్నాను. నాకు కొంత దూరంలో చండిక కూచొని ఉంది. తరుచూ మా ఇద్దరి లీజర్లు కలుస్తూ వుంటాయి.

ఇంతలో ఓ అమ్మాయిని వెంటపెట్టుకుని ఆ పిల్ల తలిదండ్రులు వచ్చారు. వాళ్లు కొంచెం ఖరీదైన మనుషుల్లా వున్నారు.

''చండికాటీచర్ ఎక్కడున్నారు?'', అని అడిగారు వాళ్లు. ''నేనే చండికని. చెప్పండి''.

''నేను ఎం.ఎల్.ఎ. ఎల్లయ్య గారి బావమరిదిని. ఈ పిల్ల మా అమ్మాయి చంద్రిక. మీ స్కూల్లోనే పదవతరగతి చదువుతోంది. మార్కులు తక్కువ వస్తున్నాయని అందరూ తనని గేలి చేస్తున్నారని స్కూల్ ఎగ్గొట్టి ఇంట్లో కూచుని ఏడుస్తోంది. మీరే ఏదో దారి చూపించండి'' అంటూ ప్రాధేయపడ్డారు వాళ్లు.

''ముందు మీరలా కూచోండి. మీరు ఎం.ఎల్.ఎ. ఎల్లయ్యగారి బంధువైనందుకు చాలా ఆనందంగా ఉంది నాకు. మీ పాప బాధ్యత నాకు అప్పగించండి. అంతా నేను చూసుకుంటాను''.

''పాపా నువ్వే సెక్షన్లో వున్నావు?''.

'' 'సి' సెక్షన్లో వున్నాను టీచర్''

''అలాగా! నీకు క్వార్టర్లీలో మార్కులెలా వచ్చాయి?''

''ప్రతీ సబ్జెక్టుల్లోనూ ఇరవై లోపే వచ్చాయి''

''ఫరవాలేదు. నిన్ను వెంటనే 'ఎ' సెక్షన్లోకి మారుస్తాను. అక్కడ వాళ్లందరికీ ఎక్కువ మార్కులు వస్తాయి. వాళ్ళవి చూసి రాసినా నువ్వు పాసవుతావు''.

ఆ మాటలు తారక మంత్రంలా పని చేసిన ఆ పిల్ల తల్లిదండ్రులు వెళ్లిపోయారు.

''ఔరా!'' ఆశ్చర్యాన్ని అంతరంగంలోనే అదిమిపెట్టాను.

★

# కోట్లు పలుకుతున్న బెక్‌హామ్ చిన్ననాటి 'కోట'




ఫుట్‌బాల్ ప్లేయర్ డేవిడ్ బెక్‌హామ్ చిన్నప్పుడు నివసించిన ఇల్లు వేలానికి పెట్టారు. ఆ ఇంటికి ఊహించని రీతిలో డిమాండ్ పెరిగిపోతోంది అని ఈ వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారవేత్త ఇయాన్ తెలిపారు.

లండన్‌లోని లీటాన్‌స్టోన్ నగరంలో ఉన్న ఈ ఇంటికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. మూడు బెడ్‌రూంలు ఉన్న ఈ ఇల్లు రద్దీ ప్రాంతాలైన రైల్వేస్టేషన్‌కు, మార్కెట్‌కు అతి సమీపంలో ఉంది. అయితే అచ్చు ఇలానే ఉన్న ఇళ్లు ఆ ప్రాంతంలో చాలా ఉన్నప్పటికీ వాటికి ఇంత డిమాండ్ లేదు. బెక్‌హామ్ నివశించిన ఇల్లు కావడం వల్లే దీనికి అంత డిమాండ్.

అసలు ఈ ఇల్లు ఒక ఫుట్‌బాల్ ఆటగాడికి చెందినదని ఇయాన్‌కు ముందు తెలియదట! ఆ ప్రాంతానికి సంబంధించిన ఓ పుస్తకాన్ని చదువుతున్నప్పుడే తెలిసిందని అతనంటున్నాడు. తను ఈ విషయం తెలుసుకున్న తరువాత ఆ ఇంటి యజమానికి చెబితే అతడు ముందు నమ్మలేదట! అయితే నిజానిజాలు తెలుసుకున్న యజమాని ఇయాన్‌కి మరో బాధ్యత అప్పజెప్పాడు మరి! అదే ఆ భవనం 'వేలంపాట' వేయడం. ఇంతకీ బెక్‌హామ్ ఆ ఇంట్లో నివసించింది ఎంతకాలం అనుకుంటున్నారు? మే 2, 1975లో బెక్‌హామ్ ఆ ఇంట్లోనే పుట్టాడు. తర్వాత రెండు సంవత్సరాలకే ఆ ఇల్లు ఖాళీ చేశారట.